క్లుప్తంగా

'అల్లం'ను కలిసిన ప్రెస్‌క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు



నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌కు విచ్చేసిన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణను ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. క్లబ్ అభివృద్ధి, ప్రభుత్వం నుంచి సభ్యులకు అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలకు సహకరించాల్సిందిగా అధ్యక్ష కార్యదర్శులు అల్లం నారాయణను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

దళితబంధు సంరక్షణ సమితి జిల్లా కమిటీ

హసన్‌పర్తి : దళిత బంధు సంరక్షణ సమితి జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా గూడెం రమేష్ (హన్మకొండ), ఉపాధ్యక్షులుగా కుక్కమూడి సంపత్(దండెపల్లి), గుత్తికొండ చక్రధర్ (వంగపల్లి), ప్రధానకార్యదర్శిగా చెరిపల్లి రామచంద్రం (శనిగరం), సహాయ కార్యదర్శులుగా చిట్యాల భద్రయ్య (గోపాలపురం, హన్మకొండ), గూడెం లింగయ్య(తిమ్మాపురం,), ఆర్గనైజింగ్ కార్యదర్శులు తుపాకుల ప్రతాప్ (హన్మకొండ), గుజ్జుల రమేష్(తిమ్మాపూర్), ప్రచార కార్యదర్శులుగా ఆరెపల్లి మల్లయ్య(జీలుగుల), ఇల్లందుల దేవయ్య(ముస్తఫాపూర్), కోశాధికారిగా మొండె భద్రయ్య (శనిగరం) లు ఏకగ్రీవమయ్యారు.

పనులను అడ్డుకున్న ఓనర్లు

వరంగల్ అర్బన్: వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులోని ఓ ప్రైవేట్ కాలేజీ సమీపంలో శివసాయి లే అవుట్ మేధ్య నుంచి బల్దియా ఇంజినీర్లు డ్రెయినేజీ నిర్మాణం చేస్తుండటంతో మంగళవారం ప్లాట్ల యజమానులు అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం ఉన్న లే అవుట్‌లో ఇలా డ్రెయినేజీ కట్టనివ్వబోమని గొడవకు దిగారు. దీంతో బల్దియా టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి చేరుకొని లే అవుట్ ప్లాట్లను పరిశీలించారు.

మంత్రి పరామర్శ



వరంగల్ చౌరస్తా : రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజనాల శ్రీహరి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజనాల శ్రీహరి తల్లి సత్య కళావతి మృతిపై మంత్రి సానుభూతి ప్రకటించి ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్‌నాయకులు తదితరులు ఉన్నారు.

'శ్వేతార్క'లో భామ చతుర్థి వేడుకలు

కాజీపేట : కాజీపేట స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో మంగళవారం భామ చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భద్రకాళి దేవాలయ ఆస్థాన పండితులు, ఆలయ వ్యవస్థాపకులు అయినవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో అర్చకులు వరుణహోమం జరిపించారు. వేసవి ఎండలు మండి పోతుండడంతో వేసవి తాపం తగ్గి వర్షాలు పడాలని ఆకాంక్షిస్తూ హోమం చేశారు. అన్నపూర్ణ భవనంలో భక్తులకు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, పీఆర్వో మణిదీప్, సుధీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ మరపురాని అనుభూతి

కాజీపేట అర్బన్ : ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ మరపురాని అనుభూతి అని నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్వీ.ఉమామహేష్ తెలిపారు. నిట్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో మంగళవారం నిట్ రిజిస్ట్రార్‌గా విధులు కొనసాగించి ఉద్యోగ విరమణ పొందిన గోవర్ధన్‌రావు దంపతులను ఘనంగా సన్మానించారు. గోవర్ధన్‌రావు సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీ వెల్ఫేర్ వైఎస్.రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా అందించాలి

హసన్‌పర్తి : భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్‌పార్టీ (డీఎస్‌పీ) డిమాండ్ చేసింది. మంగళవారం హన్మకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తి రెవెన్యూ కార్యాలయం ఎదుట డీఎస్‌పీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల రాకపోకాలకు అంతరాయం కలిగింది. అనంతరం తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా డీఎస్‌పీ మండల అధ్యక్షుడు కె. రోహిత్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి రాజ్యాంగంపై అవగాహన అవసరమన్నారు. సాయిబాబా రాజేష్, కె.దినేష్, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయాలు కొనసాగించాలి

● ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ కల్చరల్ : విశ్వబ్రాహ్మణ సభ్యులు సంఘటితంగా ఉంటూ ఆచార్య జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగించాలని, సభ్యులకు తనవంతు సహకారం అందిస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం (వోపాస్) నూతన కార్యవర్గం సభ్యులు మంగళవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఆగ్రోస్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లును కలిసి సంఘం నిర్వహించిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ మేరకు వోపాస్ భవనం కోసం స్థలం కేటాయించాలని, ఇతర సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వోపాస్ అధ్యక్షులు సిద్దోజు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి తొగటి గురుబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవాచారి, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని వినయ్‌భాస్కర్ ఘనంగా సన్మానించారు.



ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

జర్నలిస్టులకు మాట ఇచ్చి నెరవేర్చబోతున్నా..

● తూర్పు ఎమ్మెల్యే నరేందర్

వరంగల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో ఎన్నికల్లో జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేర్చబోతున్నానని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం 12వ డివిజన్ దేశాయిపేటలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రెస్‌అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల సొంత ఇంటి కల నిజం చేయాలని సంకల్పంతో సీఎం దృష్టికి తీసుకుపోవడంతో జీఓను జారీ చేశారని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ దేశాయిపేటలో ఎమ్మెల్యే నరేందర్ నిర్మించిన జర్నలిస్టు కాలనీ ఒక మోడల్ అని అభినందించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజె(143)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్, వరంగల్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఆడెపు సాగర్, కార్పొరేటర్లు సురేష్ జోషి, దిడ్డి కుమారస్వామి, పరపతి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల శ్రమదానం

కేయూ క్యాంపస్: కేయూలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పరిపాలనాభవనం ఎదుట మంగళవారం శ్రమదానం చేశారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. చెత్తచెదారం తొలగించేందుకు చీపుర్లతో ఊడ్చారు. ఈ సందర్భంగా కుక్టాజాక్ చైర్మన్ డాక్టర్ పి కరుణాకర్‌రావు మాట్లాడుతూ కేయూకు మంచి గ్రేడ్ రావటంలో తమవంతు పాత్రను కూడా పోషిస్తామని తెలిపారు.కార్యక్రమంలో కన్వీనర్ సాదు రాజేష్, బాధ్యులు నిరంజన్, మామిడి లింగయ్య, బి.సతీష్, మంతెన శంకరయ్య, కర్రె సదాశివ్, ఆరూరి సూర్యం, టి.శ్రీనివాస్, చందులాల్, మల్లేష్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

కేయూలో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం మంగళవారం కూడా కొనసాగింది. క్యాంపస్‌లోని క్యాంటీన్ పక్కన రోడ్డులో ఇరువైపుల శ్రమదానం చేశారు. అక్కడి నుంచి మహిళా హాస్టల్ వరకు చెత్తచెదారంను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ ఈ శిబిరంలో పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు.



కేయూలో పరిపాలనా భవనం వద్ద శ్రమదానం చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

అ 'పూర్వ' సమ్మేళనం



వరంగల్ : నగరంలోని ఎల్‌బీ నగర్ ప్రభుత్వ గిర్మాజీపేట హైస్కూల్‌లో 36 సంవత్సరాల క్రితం పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించుకున్నారు. సమ్మేళనంలో 36 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాలలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సమ్మేళనం నిర్వహించేందుకు సహకరించిన స్నేహితులను అందరు అభినందించారు. అరుణ్, రాజేంద్రప్రసాద్, శోభన్ బాబు, విజయ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశిబుగ్గ : గాలిదుమారం, అకాల వర్షంతో ఇళ్లు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకులు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి 36వ డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధితులకు తమవంతు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ శనివారం సాయంత్రం వచ్చిన గాలి దుమారం, అకాల వర్షానికి నగరం మొత్తం అతలాకుతలమైందన్నారు. 36వ డివిజన్ పలు కాలనీలలో ఇండ్ల పై కప్పులు రేకులు లేచిపోవడంతో చాలా కుటుంబాలు నిరాశ్రయులయ్యారన్నారు. . బీఆర్ఎస్ ధికారంలోకి 9 ఏళ్లు అవుతున్నా తూర్పులో ఏ ఒక్క కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టివ్వలేదన్నారు. దళితబంధు అధికార పార్టీ నాయకులకే ఇచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, పుప్పాల శ్రీనివాస్, ఆడెపు వెంకటేష్, కనుకుంట్ల రంజిత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఖిలావరంగల్ : ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెడిదె వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఖిలావరంగల్ పరిసరాల్లో ఇటీవల కురిసిన వర్షానికి నెలవారిన పంట పొలాలు, కల్లాల్లో తడిసి ముద్దయిన వరిధాన్యాన్ని మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట నష్టాన్ని సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల కురిసిన వర్షానికి తూర్పుకోటలో కూలిన ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఏసీరెడ్డి ప్రభాకర్, ఏసీరెడ్డి రఘు, కలకుట్ల కుమార్, సంపత్, రాజు, అశోక్, శివకుమార్, సూరిశెట్టి వినోద్, కుమారస్వామి, ఏలియా, సత్యం, రాజేష్, సాంబయ్య, నాగయ్య పాల్గొన్నారు.

'నాగుర్ల'కు టికెట్ ఇవ్వాలి

హన్మకొండ అర్బన్ : నాగుర్ల వెంకన్నకు పరకాల ఎమ్మెల్యే టికెట్ బీఆర్ఎస్ కేటాయించాలని ఆరెకుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం హన్మకొండ బాలసముంద్రంలోని ఆరె సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు హంగె శివాజీ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరెకుల ముద్దుబిడ్డ నాగుర్ల పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వెన్నంటి ఉన్నారన్నారు. ఊరూరా జెండా గద్దెలు నిర్మాణం, తెలంగాణ వాదం బలోపేతంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. నాగుర్లకు ఈసారి టిక్కెట్ ఇవ్వాలని తామంతా ముందుండి గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

హన్మకొండ అర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడకపోతే రానున్న కాలంలో మనుషుల మనుగడ కష్టంగా ఉంటుందని డాక్టర్ అనితారెడ్డి, ఈఈ సునిత అన్నారు. మంగళవారం బాలసముంద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో మానవపాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ డాక్టర్ అనితారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సునిత ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం, చెట్లను నరకడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సుభాష్, మల్లికాంబ నిర్వాహకురాలు బండ రామలీల, సదానందం, కోడం కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అనితారెడ్డి

రెండో రోజు కొనసాగిన క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహంగా కొనసాగాయి. రెండో రోజు రెజ్లింగ్, వాలీబాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, ఆర్చరీ క్రీడలలో పోటీలు నిర్వహించగా, ఆయా పోటీలకు డీఆర్‌ఓ వాసుచంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ , డీవైఎస్‌ఓ జి అశోక్‌కుమార్, డీఎస్‌ఏ కోచ్ లు నరేందర్, కె రాజు, విష్ణువర్ధన్, జీవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడాపోటీలు

కాశిబుగ్గ : సీఎం కప్ క్రీడాపోటీలు వరంగల్ ఓ సిటీ స్టేడియంలో ఉత్సాహంగా కొనసాగుతున్నా యి. జిల్లాస్థాయి పోటీలు సోమవారం ప్రారంభం కాగా రెండో రోజు మంగళవారం జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, బాక్సింగ్, చింతల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్, హనుమకొండ జేఎన్ఎస్‌లో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, స్విమింగ్ పోటీలు జరిగాయి. జిల్లా క్రీడల అధికారి ఎస్ ఇందిర మాట్లాడుతూ అన్ని ఆటలపోటీలు సెమీఫైనల్స్ దశకు చేరుకున్నాయని బుధవారం ఫైనల్స్ జరిగాక రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలి పారు. పోటీల్లో కోచ్‌లు సత్యవాణి, లింగమూర్తి, సుమన్, మహేందర్, కుమారస్వామి పీఈటీలు పాల్గొన్నారు.

దేశానికి కేసీఆర్ నాయకత్వం వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, పక్కన ఎమ్మెల్యే నరేందర్

● ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు

కాశిబుగ్గ : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్నాయని, కేసీఆర్ దేశానికి నాయకత్వం వహిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఓ సిటీ మైదానంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన 18, 19, 27 డివిజన్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు కోసం సీఎం కేసీఆర్ పార్టీ పెట్టలేదన్నారు. స్వరాష్ట్రం కోసం బీఆర్ఎస్ పెట్టి పోరాడి తెలంగాణను సాధించారన్నారు. సమ్మేళనంలో ఎమ్మెల్యే నరేందర్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మరావు, కార్పొరేటర్లు బాబు, కుమారస్వామి, అనిల్, మాజీ కార్పొరేటర్ భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని హమాలీ మృతి

కాశిబుగ్గ : పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య ధర్మారం ఎల్‌సీ గేటు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం..వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోదాసి రాజు(39) హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ధర్మారం ఎల్‌సీ గేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా అప్‌లైన్‌లో వెళ్తున్న గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు నుంచి జారిపడి మరొకరు..

వరంగల్, చింతలపల్లి రై ల్వే స్టేషన్ల మధ్య వంచనగిరి రైల్వే గేటు సమీపంలో గుర్తుతెలియని రైలులో నుంచి జారి పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడని జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు. మృతుడు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలి గి ఉంటాడన్నారు. నీలి కలర్ ఫుల్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, మెడలో స్టీల్ చైన్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిస్తే 9441557232, 94406 27532 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.



డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో 8 మంది పట్టివేత


కాజీపేట : పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 8 మందిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, ఏడుగురికి రూ.9,900 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్‌రావు మంగళవారం తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం రాత్రి ట్రాఫిక్ సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా 8 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు చెప్పారు. మద్యం అధికంగా సేవించిన పూరమాని సాంబరాజుకు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

క్షుద్రపూజల కలకలం

హన్మకొండ అర్బన్ : దర్గా బంధం చెరువు శ్మశానవాటికలో కొందరు వ్యక్తులు క్షుద్రపుజలు నిర్వహించడం కలకలం రేపుతోంది. ఇదే ప్రాంతానికి చెందిన మూడు కుటుంబాల వారి ఫొటోలు పెట్టి చెక్క బొమ్మలు, నిమ్మకాయలు వంటి ఇతర సామగ్రితో శ్మశానవాటికలో క్షుద్రపూజలు నిర్వహించిన ఆనవాళ్లు ఉన్నాయి. ఇది గమనించిన స్థానికులు అక్కడ ఫొటోల్లో ఉన్న కుటుంబాల వారికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడి పరిస్థితి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే దగ్గరి వ్యక్తులు, బంధువర్గంలోని వారే ఈ పనిచేసి ఉం టారని బాధిత కుటుంబాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. క్షుద్రపూజలు నిర్వహించినా, వా రికి సహకరించిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి



హన్మకొండ: వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ఏకశిల విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను విద్యార్థి సంఘాల నాయకులు కలిశారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా వసూలు చేసిన ఫీజులు తిరిగి ఇప్పించాలని కోరుతూ చీఫ్‌విప్‌కు వినతి పత్రం అందించారు. ఏకశిల విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసి విద్యార్థుల దగ్గర తీసుకున్న ఫీజులను తిరిగి ఇప్పించే వరకు జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లో 1335 మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపెల్లి వినోద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించినట్లు కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం రామేశ్వర్‌రావు, కేయూ అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్‌లోథ్ మంగళవారం తెలిపారు.

జెండాలు పాతిన సీపీఎం నాయకులు

కాశిబుగ్గ : వరంగల్ 35వ డివిజన్ మైసయ్యనగర్ సమీపంలోని 321 సర్వే నెంబర్ శివనగర్ బతుకమ్మ చెరువులో పేదల ఇళ్ల స్థలాల కోసం వరుసగా రెండో రోజు మంగళవారం సీపీఎం నాయకులు జెండాలు పాతారు. మైసయ్యనగర్ వాసులు మహిళలు బతుకమ్మలు ఆడే చెరువులో జెండాలు పాతొద్దని వారిని అడ్డుకుని జెండాలను తొలగించారు. దీంతో వారి మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. మైసయ్యనగర్ వాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని సీపీఎం నాయకులను అదుపులోకి తీసుకున్నారని స్థానికులు తెలిపారు. సీపీఎం నాయకురాలు రత్నమాల మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదల ఇండ్ల స్థలాల కోసం తాము పోరాడుతున్నామని ప్రభుత్వం స్పందించి ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఆమె డిమాండ్ చేసింది.

వికలాంగులకు ప్రాధాన్యం

హన్మకొండ: వికలాంగుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో స్నేహనగర్‌కు చెందిన పేదవాడైన కమటం రాజలింగంకు ప్రభుత్వం మంజూరు చేయించిన వినికిడి యంత్రాన్ని అందించారు.

ఆర్థికసాయం



న్యూశాయంపేట : ఇటీవల గాలివానతో చింతల్ ప్రాంతంలో ఇంటి కప్పులు ఎగిరిపోయి ఇబ్బందులు పడుతున్న బాధితులను కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పరామర్శించారు. మంగళవారం 36వ డివిజన్ చింతల్ ప్రాంతంలో కొండా మురళీ ఓదార్పు యాత్రను నిర్వహించి మాట్లాడుతూ తూర్పులోని ప్రజలకు తాను ఎల్లప్పుడు అండా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆస్తినష్టం జరిగిన బాధితులకు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సోహైల్, సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, మీసాల ప్రకాశ్, చిప్ప వెంకటేశ్వర్లు, రేణుకుంట్ల శివ, బత్తుల వినోద్, కూచన రవీందర్, దాసరి రాజేష్, అనీల్, తదితరులు ఉన్నారు.

28వ డివిజన్‌లో..

ఇటీవల గాలివానతో ఆస్తి నష్టం జరిగిన పుప్పాల గుట్టకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు చాంద్‌కు 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ దంపతులు రూ.11వేలు మంగళవారం ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు చాంద్‌బాయ్‌కి గాలివానతో పెద్ద ఎత్తున ఆస్తినష్టం జరిగిందని తెలిసి ఆర్థికసాయం అందించామన్నారు.

పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న 'పాములపర్తి'

రామన్నపేట : దీర్ఘకాలిక కండరాలు, డిస్క్ నొప్పులతో బాధపడుతున్న ఎందరో పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న గొప్పవక్తి ఆయుర్వేద వైద్యుడు పాములపర్తి రామారావు అని ప్రముఖ చిత్రకారుడు జీ.వి సాగర్ అన్నారు. మంగళవారం ఎర్రగట్టు గుట్ట వద్ద రామారావు నిర్వహిస్తున్న ఉచిత వైద్యశాలను సందర్శించి సాగర్ తన స్వహస్తాలతో ప్రత్యేకంగా చిత్రీకరించిన రామారావు చిత్రపటాన్ని అయనకు బహూకరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామారావు పేదల ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి కొనియాడారు.

సైనిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నయీంనగర్: మాజీ సైనికుల కోసం రూ.100 కోట్లతో సైనిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని హన్మకొండ జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిట్ల వేణుగోపాల్ నేత కోరారు. మంగళవారం హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన స మావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్మీ డిగ్రీని అ న్ని పోటీ పరీక్షలకు అనుమతించాలని, మెడిసిన్ సీ ట్లలో 5 శాతం కేటాయించాలని, మెడికల్ సదుపాయాలు, బ్యాక్‌లాగ్ పోస్టులు, ఇండ్ల స్థలాలు కేటా యించాలన్నారు. ఈ నెల 28న జనగామలో జరిగే తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల సమ్మేళన సభకు మాజీ సైనికులందరూ హాజరుకావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రామకృష్ణ, రఫీ, రఘు, మక్బుల్ పాషా, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ నేత, భిక్షపతి, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటికే 'కల్యాణలక్ష్మి'



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

కాజీపేట అర్బన్ : లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు అరూరి రమేష్ పంపిణీ చేశారు. కాజీపేట మండలం 44, 45వ డివిజన్ పరిధిలోని కడిపికొండ, కుమ్మరిగూడెం, రాంపేటకు చెందిన లబ్దిదారుల ఇంటికి స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి చెక్కులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, దర్గా పీఏసీఎస్ చైర్మన్ వనం రెడ్డి, మాజీ కార్పొరేటర్ బస్కే శ్రీలేఖ, రమేష్, జైపాల్‌రెడ్డి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.